

ముందు జాగ్రత్తతో వైరల్ జ్వరాల నియంత్రణ

- వ్యాధులను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం
- ప్రజాశక్తితో జిల్లా మలేరియా అధికారి నూకరాజు



ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, తదితర వైరల్ జ్వరాలను ముందు జాగ్రత్తలతో నివారించుకోవచ్చని జిల్లా మలేరియా అధికారి నూకరాజు అన్నారు. విష జ్వరాల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఆ వ్యాధులు ప్రాణాంతకం అయ్యే అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డెంగీ, మలేరియా పరీక్ష కిట్లు అందుబాటులో ఉంటాయని, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవచ్చని తెలిపారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు..

జిల్లాలో వైరల్ జ్వరాల విజృంభణ ఎలా ఉంది?

డిఎంఓ : జిల్లాలో 2023 సంవత్సరంలో 241 డెంగీ కేసులు, నాలుగు మలేరియా కేసులు నమోదయ్యాయి. 2024 జనవరి నుంచి ఇప్పటివరకు 4 మలేరియా కేసులు, 194 డెంగీ కేసులు నమోదు అయ్యాయి. కర్నూలు అర్బన్‌తో పాటు క్రిష్ణగిరి, దేవనకొండ, సి.బెళగల్ మండలాల్లో ఈ వ్యాధులు ఎక్కువగా ప్రబలుతున్నాయి.

డెంగీ, మలేరియా పరీక్షలు ఎక్కడ అందుబాటులో ఉన్నాయి?

డిఎంఓ : జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డెంగీ, మలేరియా పరీక్ష కిట్లు అందుబాటులో ఉంటాయి. రోగుల నుంచి సేకరించిన నమూనాలను కర్నూలు జిజిహెచ్, ఆదోని ఏరియా ఆసుపత్రులకు వ్యాధి నిర్ధారణకు పంపిస్తారు. ఈ వ్యాధులకు మందులు కూడా అందుబాటులో ఉన్నాయి.

మలేరియా ఎలా వస్తుంది, రాకుండా తీసుకోవలసిన ముందు జాగ్రత్తలు ఏమిటి?

డిఎంఓ : ప్లాస్మోడియం పరాన్న జీవుల వల్ల మలేరియా వస్తుంది. పరాన్న జీవులు పోకిన ఆడ ఎనాఫిలిస్ దోమ కాటు ద్వారా ప్రజలకు ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. వర్షా కాలంలో దోమలు ఎక్కువవడం వల్ల ఎక్కువగా ఈ వ్యాధి ప్రబలుతుంది. చలి వణుకుతో కూడిన తీవ్రమైన జ్వరం, తలనొప్పి, పళ్ళునొప్పులు ఈ జ్వరంలో వస్తాయి. మలేరియా మందులను వైద్యులు సూచించిన విధంగా తీసుకోవాలి. పరిసరాలలో నీటి నిల్వలను లేకుండా చూసుకోవాలి. ఇళ్లలో, గోడలపై దోమల మందు చల్లించుకోవాలి. ఆరు బయట నిద్రించకూడదు. దోమల బారిన పడకుండా దోమ తెరలు వాడాలి. ఇంటి కిటికీలకు, తలుపులకు జాళీలు బిగించుకోవాలి.

డెంగీ వ్యాధి ఎలా వస్తుంది? లక్షణాలు ఎలా ఉంటాయి?

డిఎంఓ : డెంగీ వ్యాధి చిన్నపిల్లల నుంచి పెద్దవారి దాకా సోకుతుంది. వైరస్ వలన కలిగే ఈ వ్యాధి ఆడ 'ఎడిస్' రకం దోమకాటు ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఈ దోమలు ఇండ్లలోని నీటి నిల్వల్లో మాత్రమే పెరుగుతాయి. ఈ దోమలు పగలు కుడతాయి. ఈ వ్యాధి హఠాత్తుగా వచ్చి తీవ్రమైన జ్వరంతో మొదలవుతుంది. ఈ వ్యాధిని ఎలిసా పరీక్ష ద్వారా నిర్ధారిస్తారు. కండ్లు కదిలించలేని పరిస్థితి, ఎముకల్లోనూ, కండరాలోను భరించలేని నొప్పి, శరీరంపై పొక్కులు (రాష్) వస్తాయి. వాంతులు, వికారం, రక్తంతో కూడిన మల విసర్జన చాలా ప్రమాదకర లక్షణాలు. ఈ వ్యాధికి పూర్తి చికిత్స లేదు. లక్షణాలను బట్టి వైద్యులు ఉపశమన చర్యలు చేపట్టాలి. వ్యాధి తీవ్రంగా ఉన్నట్లయితే ప్రభుత్వ సర్వజన, జిల్లా ఆసుపత్రులను సంప్రదించాలి. పూర్తిగా కోలుకునే వరకు వైద్యుని పర్యవేక్షణలో ఉండాలి. నిర్లక్ష్యం చేస్తే ఈ వ్యాధి ప్రాణంతకంగా మారొచ్చు. రక్త నమూనాలను పరీక్షించి వ్యాధి నిర్ధారణ (ఎలీసా పరీక్ష ద్వా) పొందాలి.

డెంగీ రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

డిఎంఓ : తాగి వదిలేసిన కొబ్బరి బొండాలు, పాతటైర్లు, ఖాళీ డబ్బాలు, విరిగిపోయిన ప్లాస్టిక్ డబ్బాలు ఇంటి పరిసరాలలో ఉంచకుండా చూడాలి. ఇంటి లోపల, బయట నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలి. నీటి తొట్టెలను వారానికి ఒకసారి ఖాళీ చేసి ఆరబెట్టి మరల నింపుకోవాలి. వాటర్ ట్యాంకులు, ఇంటిలో నీటి నిల్వల మీద దోమలు జొరబడకుండా మూతలు వేసి ఉంచాలి.

చికెన్ గున్యా ఎలా వస్తుంది? లక్షణాలు ఎలా ఉంటాయి?

డిఎంఓ : దోమ కాటు ద్వారా వ్యాపించే ఈ వ్యాధి వల్ల మనిషి బలహీనపడి కీళ్ల నొప్పులతో కదల లేని స్థితిలో ఉంటాడు. ఈ వ్యాధి ఎక్కువ మందికి ఒకేసారి వచ్చే అవకాశం ఉంది. ఈ వ్యాధి సోకిన వారు వ్యాధి నిరోధక శక్తి కోల్పోయి ఇతర వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. ఈ వ్యాధిలో అకస్మాత్తుగా తీవ్రమైన జ్వరం, తలనొప్పి, ఒళ్ళు నొప్పులు ఉంటాయి. వ్యాధి తిరగబడినపుడు తీవ్రమైన జ్వరంతో పాటు కీళ్ల నొప్పులు ఉంటాయి. ప్రాణభయం లేనప్పటికి వ్యాధి వల్ల వచ్చిన నీరసం, నొప్పుల వల్ల కోలుకోవడానికి చాలా సమయం పడుతుంది.



అందుబాటులోకి మరింత ఇసుక

- కొత్తగా ఐదు రీచ్‌లు గుర్తింపు
- 11 నుంచి ఆన్‌లైన్ విధానం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో మరింత ఇసుక అందుబాటులోకి రానుంది. కొత్తగా ఐదు ఇసుక రీచ్‌లను గుర్తించారు. అవి త్వరలో అందుబాటులోకి రానున్నాయి. టన్ను ఇసుక రూ.326గా నిర్ణయించారు. దానితో పాటు రవాణ ఛార్జీలు అదనంగా చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం ఆఫ్‌లైన్ ద్వారా ఇసుక అమ్మకాలు సాగనుండగా 11 నుంచి ఆన్‌లైన్ విధానం ద్వారా ఇసుక విక్రయాలు చేపట్టనున్నారు..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రస్తుతం కౌతాళం మండలంలోని గుడి కంబాళి ఇసుక రీచ్ మాత్రమే అందుబాటులో ఉండగా త్వరలో మరిన్ని ఇసుక రీచ్‌లు అందుబాటులోకి రానున్నాయి. సి.బెళగల్ మండలంలో ఐదు ఇసుక రీచ్‌లను గుర్తించారు. సి.బెళగల్ మండలంలోని కె.సింగవరం, ముడుమాల, ఈర్లదిన్నె, కొత్తకోట, గుండ్రేవులలో ఇసుక డీ సిల్టింగ్ పాయింట్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ నెల 28 లేదా 29 తేదీల నుంచి వాటిని అందుబాటులోకి తీసుకురానున్నారు. టన్ను ఇసుక ధరను రూ.326గా నిర్ణయించారు. తవ్వకాలు, లోడింగ్ ఛార్జీల కోసం రూ.168, సీనరేజి, రాయల్టీ ఛార్జీ రూ.88, జిఎస్‌టి రూ.70 కలిపి టన్నుకు రూ.326 వసూలు చేయనున్నారు. ఆ ధరతో పాటు రవాణా కోసం కొనుగోలుదారులు రవాణా ఛార్జీని చెల్లించాల్సి ఉంటుంది. 20 కిలోమీటర్ల వరకు 4.5 టన్నులు ఇసుక పట్టే ట్రాక్టర్‌కు రూ.1400, 10 టన్నుల ఇసుక పట్టే ఆరు టైర్లు ఉన్న లారీకి రూ.2 వేలు, 18 టన్నుల ఇసుక పట్టే 10 టైర్లు ఉన్న లారీకి రూ.3,600, 22 టన్నులు ఇసుక పట్టే 12 టైర్లు ఉన్న లారీకి రూ.3,840, 31 టన్నుల ఇసుక పట్టే 16 టైర్లు ఉన్న లారీకి రూ.4,480 చెల్లించాల్సి ఉంటుంది. 20 కిలోమీటర్లు దాటికే ఒక టన్నుకు రూ.8, 18 టైర్ల లారీకి మాత్రం టన్నుకు రూ.7 చొప్పున అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఇసుక ధర, రవాణా ఛార్జీల వివరాలు తెలిసేలా ఇసుక డీ సిల్టింగ్ పాయింట్ల వద్ద బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. ఐదు డీసిల్టింగ్ పాయింట్లలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. వాటికి సంబంధించిన లైవ్ ఫీడ్ ఆర్డీవో, తహశీల్దార్లు, పోలీస్ వారికి అందుబాటులో ఉంచనున్నారు. ప్రతి చెక్ పోస్ట్ వద్ద ఐదు శాఖలతో కూడిన అధికారులతో బృందాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆఫ్‌లైన్ విధానం ద్వారా ఇసుక అమ్మకాలు సాగించనున్నారు. కర్నూలు గనుల శాఖ కార్యాలయంలో ఒక బుకింగ్ పాయింట్‌ను, సి.బెళగల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న సచివాలయంలో ఒక బుకింగ్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. రోజుకు 250 మందికి ఇసుకను విక్రయించేలా ఏర్పాటు చేశారు. వినియోగదారులు 11 నుంచి ఆన్‌లైన్ ద్వారా ఇసుక అమ్మకాలు చేపట్టనున్నారు. త్వరలో మరో మూడు ఓపెన్ రీచులను అందుబాటులోకి తీసుకురానున్నారు. కౌతాళం మండలంలోని గుడికంబాలి, నదిచాగి, మరలి రీచులకు పబ్లిక్ హియరింగ్, పర్యావరణ అనుమతులు రావలసి ఉంది. ఆ ప్రక్రియలు పూర్తి కాగానే వాటిని కూడా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.



కె.సింగవరం ఇసుక రీచ్ (ఫైల్)

అక్రమంగా తరలిస్తే..

ఇసుకను అక్రమంగా తరలిస్తే జిల్లా టోల్ ఫ్రీ నెంబర్ 18004256042కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. అదే విధంగా మెయిల్ ద్వారా **dmgokurnoolsandcomplaints@yahoo.com** కూడా ఫిర్యాదు చేయవచ్చని కర్నూలు జిల్లా కలెక్టర్ తెలిపారు.

ఇసుక ధరలు ఇలా(20 కిలోమీటర్ల వరకు)..

టన్నులు	ఇసుక ధర	రవాణా ఛార్జీ	మొత్తం
4.5	1467	1400	2867
10	3260	2000	5868
18	5868	3600	9468
22	7172	3840	11,012
31	10,106	4480	14,586

అశోక్ లేలాండ్ , మహేంద్ర షోరూంతో ప్రజలకు కష్టాలు

- 35 ఏళ్లుగా ట్రాన్స్‌ఫార్మర్ లేకుండా విద్యుత్తు వాడకం
- సర్వీస్ సెంటర్ ద్వారా ప్రజలకు అనారోగ్యాలు
- స్పందించని కార్పొరేషన్, విద్యుత్ అధికారులు



ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని సంతోష్‌నగర్ లో అశోక్ లీలాండ్ ఆటోమోటివ్ మహేంద్ర షోరూం యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నా మామూళ్ల మత్తులో మునిగిన విద్యుత్ శాఖ, నగరపాలక సంస్థ కార్యాలయం సిబ్బంది చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రజలకు శాపంగా మారింది. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఏమాత్రం పట్టించుకోవడంలేదని పరిసర ప్రాంతాల ప్రజలు విమర్శిస్తున్నారు. షోరూం ప్రారంభించి 35 యేళ్లయినా ఇంతవరకు 25 కిలోవాట్ల విద్యుత్ కన్నా ఎక్కువ వినియోగం చేస్తున్న ప్రతి షోరూం , పరిశ్రమ ట్రాన్స్‌ఫార్మర్‌ను విధిగా అమర్చుకోవాలి. అధికారులు వచ్చినప్పుడు ఏదో సమాధానం చెబుతూ మామూలు ఇవ్వడంతో చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. నగరపాలక సంస్థకు, విద్యుత్ సంస్థకు భారీగా నష్టం వాటిల్లుతుంది. అంతేకాక నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ షోరూంను నడుపుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. అనారోగ్యాల బారిన పడుతున్నారు. హైవేలో ప్రధానంగా ఉన్న ఈ షోరూమ్ అందరూ చూస్తున్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకుపోవడం దారుణం. సర్వీస్ సెంటర్ నువెనుక భాగాన వాహనాలకు సర్వీసింగ్ చేయడం వల్ల వెనక భాగంలో ఉన్న ఇండ్ల వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజలతో నీళ్లు వదలడం దాని ద్వారా వాహనాల ఆయిల్ లాంటివి మనుషులపై పడుతుంది. అంతేగాక ఆ నీటిని మురుగు కాలువలో వదలడంతో దుర్వాసనతో దోమలు ఎక్కువయి ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఈ విషయం మున్సిపల్ అధికారులకు విన్నవించినా ఏమాత్రం పట్టించుకోవడం లేదు. సర్వీస్ సెంటర్‌ను షోరూమ్ పరిధిలోని ఉంచుకొని బయటి వాళ్లకి ఇబ్బంది లేకుండా చేసుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. మురుగు నీరు అంతా పైప్ లైన్ ద్వారా షోరూమ్ ముందు కాలువలో వదులుకుంటే ప్రజల బాధలు అర్థమవుతాయి. వెంటనే విద్యుత్తు అధికారులు చర్యలు తీసుకొని ట్రాన్స్‌ఫార్మర్ బిగించాలని అలాగే సర్వీస్ సెంటర్‌ను కూడా షోరూం లోపల భాగంలో ఏర్పాటు చేసుకునేలా నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకోవాలి. అలా చేయని పక్షంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో షోరూం ముందువిద్యుత్తు, నగరపాలక సంస్థ కార్యాలయం వద్దధర్నా కార్యక్రమాన్ని చేస్తామని హెచ్చరించారు.

వాసన భరించలేకపోతున్నాం

- తరచూ విద్యుత్ అంతరాయం



అశోక్ లీలాండ్ షోరూం నుండి వెలువడిన వాసన భరించ లేకపోతున్నాం. దీనివల్ల ఆస్తమా, క్యాన్సర్ లాంటి జబ్బులు వచ్చే అవకాశం ఉంది. ఈ వాసనకు బయట తిరగలేని పరిస్థితి నెలకొంది. రాత్రిపూట షోరూమ్‌కు సామర్థ్యాన్ని మించి విద్యుత్ వాడటం వల్ల చెట్లు విద్యుత్ తీగలకు తగిలి రోజు మూడు గంటలపాటు అంతరాయం ఏర్పడుతుంది. దీంతో ఇండ్లల్లో చిన్నపిల్లలు, వయోవద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి షో రూమ్ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలి.

ఎండి. యూనుస్, సంతోష్ నగర్.

దోమలు ఎక్కువయ్యాయి : అన్వర్ బాషా, కాలనీవాసి.



షో రూమ్ వారు వదిలే మురుగు నీటి వల్ల కాలువలు నుండి దోమలు ఎక్కువయ్యాయి. రాత్రి పూట నిద్ర పట్టడం లేదు. పగలు బయట కూర్చునే పరిస్థితి లేదు. వీటివల్ల మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా అలాంటి జబ్బులు వస్తున్నాయి. జబ్బులు వచ్చి ఆసుపత్రిలో చేరి జోబులు ఖాళీ అవుతున్నాయి. మాపై దయ ఉంచి మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకొని మురుగునీటిని కాలువల్లో వదలకుండా చర్యలు తీసుకోవాలి.

త్వరలో ట్రాన్స్‌ఫార్మర్ను ఏర్పాటు చేస్తాం : ఎస్ఇ


అశోక లీలాండ్ షోరూం యాజమాన్యం ట్రాన్స్‌ఫార్మర్ లేకుండా విద్యుత్తును వాడుతున్నారు. ఎందుకు చర్యలు తీసుకోలేదని విద్యుత్ శాఖ ఎస్ఇని ప్రజాశక్తి వివరణ కోరగా ట్రాన్స్‌ఫార్మర్‌కు కావాల్సిన ఎస్టిమేషన్లు వేయాలని అధికారులకు సూచించారు. త్వరలో ఎస్టిమేషన్ పంపి వారి ద్వారా డబ్బులు కట్టించుకుని ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తాం.

హలో కెఎంసికి వచ్చే ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



హలో కెఎంసికి వస్తున్న ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం చూపుతున్నామని రామలింగేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలు పేర్కొన్నారు. అత్యంత పారదర్శకత జవాబుదారీతనంతో ప్రజా ఫిర్యాదుల విభాగం పనితీరు భేష్‌గా ఉందని చెప్పారు. గత మూడు నెలలుగా వచ్చిన ఫిర్యాదుల్లో 84.07శాతం సమస్యలు పరిష్కరించామని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల విభాగం సెల్ నెంబర్ 7422992299. వచ్చిన ఫిర్యాదులలో ఆర్థికపరమైన, ఇతరత్రా కారణాలతో కొన్ని పెండింగ్‌లో ఉండగా మిగతావి వివిధ దశల్లో పరిష్కార మార్గాల్లో ఉన్నాయని తెలిపారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్‌కుమార్, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ నరసింహ

ఘనంగా యుటిఎఫ్ క్రీడా సంబరాలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా ఆదివారం ఉపాధ్యాయుల జిల్లాస్థాయి క్రీడా సంబరాలు ఘనంగా జరిగాయి. కర్నూలు నగరంలోని స్థానిక అవుట్ డోర్ స్టేడియంలో షటిల్ పోటీలు , సెయింట్ జోసెఫ్ కళాశాల మైదానంలో క్రికెట్ పోటీలతోపాటు షార్ట్‌పుట్, క్యారమ్స్,చెస్ తదితర పోటీలను నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు యుఆర్ఎ.రవికుమార్ అధ్యక్షతన జరిగిన పోటీలను రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఏర్పడి ఈఏడాది ఆగస్టు నాటికి 50 సంవత్సరాలు పూర్తయిందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన జట్లకు అక్టోబర్ 4,5,6 తేదీలలో గుంటూరులో రాష్ట్రస్థాయి సంబరాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రీడాసంబరాల్లో ఉపాధ్యాయులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. క్రికెట్ మ్యాచ్‌కు సంబంధించి కర్నూలు , ఎమ్మిగనూరు డివిజన్ జట్లమధ్య పోటీ జరుగగా ఎమ్మిగనూరు జట్టు గెలుపొందింది. జిల్లాస్థాయి షటిల్ పోటీలో కిరణ్, కౌసర్ గెలుపొందారు. ఈ సందర్భంగా గెలుపొందిన జట్లకు కె.సురేష్‌కుమార్‌తో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ నరసింహ మెమెంటోలను అందజేశారు. యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు హేమంత్‌కుమార్, జిల్లా కార్యదర్శులు ఎస్.నరసింహులు, తిమ్మన్న దుర్గాప్రసాద్ రాష్ట్ర కౌన్సిలర్లు జయరాజు, ఎల్లప్ప ఆడిట్ కమిటీ సభ్యులు కౌలన్న, మారెప్ప వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రధాన మంత్రి లక్‌పతి లక్ష్యం నెరవేర్చాలి

ప్రజాశక్తి- సి బెళగల్

సి బెళగల్ మండలం ప్రధాన మంత్రి లక్ పతి లక్ష్యం నెరవేర్చాలని ఎపిఎం వెంకటస్వామి పేర్కొన్నారు. ఆదివారం వెలుగు కార్యాలయంలో పొదుపు గ్రూపులకు, సభ్యులకు అవగాహన కల్పించారు. రూ. లక్ష నుండి రూ.ఐదు లక్షల వరకు ఉపాధి పొందెందుకు రుణాలు అందుకోవచ్చున్నారు. సబ్సిడీ ఏ మాత్రం ఉండదని, తీసుకున్న రుణం అరవై నెలల్లో చెల్లించాలని సద్వినియోగం చేసుకోవాలని కోరారు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు


ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించే 'ప్రజా సమస్యల పరిష్కారవేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టం) శ్రీకృష్ణ జన్మాష్టమి సెలవు కావడంతో రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి వ్యయ ప్రయాసలకోర్చి జిల్లా కేంద్రానికి రావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

- ఎంపీ, ఎమ్మెల్యేలు
- లఖ్‌పతి దీదీ ద్వారా రూ 57.60 కోట్ల రుణాలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ధ్యేయం అని కర్నూలు ఎంపీ బస్తీపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు గౌరుచరితరెడ్డి, బొగ్గుల దస్తగిరి పేర్కొన్నారు. ఆదివారం కలెక్టరేట్ ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటినాగరాజు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, ఎమ్మెల్యేలుగౌరు చరితారెడ్డి, బొగ్గుల దస్తగిరి తదితరులు పాల్గొని వీక్షించారు. అనంతరం జిల్లాలోని 826 మంది స్వయం సహాయక సంఘాల లఖ్‌పతి దీదీలకు బ్యాంకుల ద్వారా రూ.57.60 కోట్ల మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. వారుమాట్లాడుతూ పొదుపు సంఘాలలోని మహిళలు అందరూ ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థికలబ్ధిని సమర్థవంతంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. పొదుపు సంఘాల ద్వారా బ్యాంకుల నుండి రుణాలు పొంది సొంతంగా వ్యాపారాలు చేసుకుంటూ సకాలంలో పొందిన మొత్తాన్ని తిరిగి చెల్లిస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పొదుపు సంఘాల ఏర్పాటు ద్వారా మహిళలు వివిధ పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని స్వయంగా వృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. ఈ పథకం ద్వారా వడ్డీ లేకుండానే రుణాలను మంజూరు చేశామని, వాటిని సకాలంలో చెల్లించిన వారికి ఇంకా అధిక మొత్తంలో మళ్లీ రుణాలు ఇవ్వనున్నారు. మహిళలకు ఈ పథకం ద్వారా ఉపాధి శిక్షణ ఇచ్చి తమ కాళ్లపై తాము నిల్చునేలా ఆర్థిక అక్షరాస్యత, ఆర్థిక సహాయం అందజేస్తారు. దీంతో వారు తమ ఆదాయ వనరుల్ని పెంచుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి సలీం బాషా, ఎల్‌డిఎం రామచంద్రరావు, పొదుపు సంఘాల మహిళలు (లఖ్ పతి దీదీలకు), సిఆర్‌పిలు, బుక్‌కీపర్స్ తదితరులు పాల్గొన్నారు.



మెగా చెక్కును అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

బీడీ కార్మికులకు ఒరిజినల్ ఇండ్ల పట్టాలు ఇవ్వాలి

మంత్రి టి జి భరత్‌కు ఆవాజ్ కమిటీ వినతి

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

బీడీ కార్మికులకు ఒరిజినల్ ఇండ్ల పట్టాలు ఇవ్వాలని, అక్కడ మౌలిక వసతులు కల్పించాలని ఆవాజ్ రాష్ట్ర అధ్యడులు ఎస్ అబ్దుల్ సుభాన్ ,పి.ఇక్బాల్ హుస్సేన్ కోరారు. కర్నూలు నగరంలోని 19వ వార్డు పరిధి జోహరాపురం బీడీ కార్మికుల ఇండ్లకు పట్టాలు ఇచ్చి మౌలిక వసతులు కల్పించాలని ఆవాజ్ నగర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎ. అబ్దుల్ సుభాన్, ఆవాజ్ నగర అధ్యక్ష కార్యదర్శులు పి.ఇక్బాల్, ఎస్ఎండి షరీఫ్ మంత్రి టిజి. భరత్‌కు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ గతంలో ఎంఎ.గఫూర్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు 2007లో కేంద్ర ప్రభుత్వ సహకారంతో బీడీ కార్మికులకు ప్రత్యేక స్కీం కింద ఇండ్లను మంజూరు చేయించారని, దానికి సంబంధించి ఒక్కో లబ్ధిదారుడు ప్రత్యేకంగా రూ.5వేలు కలెక్టర్, లేబర్ ఆఫీసర్‌ల జాయింట్ అకౌంట్ పేరుతో తమ ఇళ్ల అభివృద్ధి కోసం ఆనాడే డీడీలు చెల్లించారన్నారు. వారి ఇండ్ల స్థలాల దగ్గర సిసి రోడ్లు కాలువలు, వీధి స్తంభాలు, దీపాలు మంచినీటి సౌకర్యం ఇలా మౌలిక వసతులు కల్పించడంలో గతంలోని వైసిపి ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. అనేకసార్లు మాజీ ఎమ్మెల్యేను కలిశామని, ఏదో ఒక సాకు పేరుతో పట్టాలు ఇవ్వలేదన్నారు. కనీసం నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత తమరు ఈ ఒరిజినల్ పట్టాలు ఇప్పించాలని, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. పెండింగులో ఉన్న బిల్లులు కూడా వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అక్కడి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఏర్పాటు చేయడం కోసం చోహరాపురం డంపింగ్ యార్డ్ దగ్గర హైదరాబాద్, ఎన్టీఆర్ గార్డెన్ తరహా ఓ మంచి పార్కును ఏర్పాటు చేయాలని కోరారు. ఇళ్ళ లబ్ధిదారులు మహిముద్, ముక్తియార్, అల్లా బహాష్ మహబూబ్, గౌస్ బాషా, మహమ్మద్ నబి, అహ్మద్, ఎక్బాల్, బషీర్‌అహ్మద్, ఎండి హనీఫ్, అన్వర్‌బాష, సయ్యద్ అహ్మద్ బాష, 50 మంది లబ్ధిదారులు పాల్గొన్నారు. మంత్రి భరత్ మాట్లాడుతూ మీ సమస్యను వీలైనంత త్వరగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, మీ ఇండ్లకు పట్టాలు మౌలిక వసతుల కల్పన కోసం ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు.



మంత్రి టిజి భరత్‌కు వినతిపత్రం ఇచ్చి సమస్యలు వివరిస్తున్న ఆవాజ్ కమిటీ నాయకులు

సేవాభావంతో ఉచిత వైద్య శిబిరం

సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మానవసేవే మాధవ సేవగా భావించి సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాగాంధీనగర్‌లోని సుందరయ్య భవన్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు కో కన్వీనర్ రంగస్వామి, సభ్యులు జెఎన్.శేషయ్య చెప్పారు. సుందరయ్య స్ఫూర్తికేంద్రం ఆధ్వర్యంలో షుగరు, బిపి, పక్షవాతం, మూర్ఛ లాంటి జబ్బులకు వైద్యులు రోగులను పరిశీలించి రెండు నెలలకు సరిపడా మందులను కేవలం రూ.300 అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి జరిగే వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సుమారు రూ.3000 విలువ చేసే మందులు కేవలం రూ.300 ఇస్తున్నామని తెలిపారు. రోగులు రెండు రోజులు ముందుగా బీపీ, షుగర్, పరీక్షలు చేయించుకొని వచ్చినట్లయితే పరిశీలించి వారికి తగిన మందులను ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. వైద్యులు డాక్టర్ భరత్, డాక్టర్ నాగభూషణరావు, డాక్టర్ హనీఫ్, డాక్టర్ తేజలు వైద్య సేవలు అందించారు. డి.దుర్గా మెడికల్ ఎపిసోడ్ ఖలీల్,శాస్త్రిశంకర్‌రామ్, సుబ్బయ్య, షేక్షావలి, మందులను పంపిణీ చేశారు. ఈవైద్య శిబిరానికి రంగస్వామి, బసయ్య, శ్రీనివాసులు, సుధాకరప్ప హుస్సేనయ్య, ఏసు, ఎల్లాగౌడ్‌లు సహాయ సహకారాలను అందించారు.



ఉచితంగా వైద్యం చేస్తున్న వైద్యులు

కుళాయిల్లో రంగుమారిన నీరు

- ఫిల్టర్ చేయకుండానే సరఫరా చేస్తున్నారని స్థానికుల ఆందోళన

ప్రజాశక్తి-ఆదోని

మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే స్వచ్ఛమైన నీరు తాగాలి. ఆ నీరే కలుషితమైతే రోగాలు బారిన పడాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. రంగు మారిన నీళ్లు తాగితే డయేరియా సోకే అవకాశం ఉంది. ఆదోని పట్టణంలోని కుళాయిల ద్వారా రంగు మారిన నీళ్లు వస్తున్నాయి. విషయం మున్సి పాలిటీ అధికారులకు చెప్పినా కాచి వడ పోసుకుని తాగాలని ఉచిత సలహా ఇస్తున్నారు తప్ప శుద్ధ జలాల సరఫరాకు చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికే డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా జ్వరాలతో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్సకు చేరే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. మరికొందరు మెరుగైన వైద్యం అంటూ ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లో చికిత్సలు చేయించు కుంటున్నారు. ఒళ్ళు నొప్పులు, తలనొప్పి, వికారం, వాంతులు, విరోచనాలు వంటి లక్షణాలతో చాలామంది ఆసుపత్రికి వస్తున్నారని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వైద్యులు చెబుతున్నారు.ఆదోని పట్టణంలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కుళాయిల ద్వారా కలుషిత నీరు వస్తున్నాయని ఆయా ప్రాంతాల వాసులు విమర్శిస్తున్నారు. క్రాంతి నగర్, కౌడం పేట, కార్వాన్ పేట ప్రాంతాలలో కుళాయి ద్వారానే వండు నీళు వస్తున్నాయని, వీటిని తాగడం వల్ల రోగాల బారిన పడుతున్నామని ఆయా కాలనీల వాసులు ఆందోళన చెందుతున్నారు. బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుండి మున్సిపల్ కార్యాలయంలో ఉన్నపంప్ హౌస్‌కు నీరు చేరుతుంది అక్కడి నుండి ఆయా ప్రాంతా లలో ఉండే ఓవర్ హెడ్ ట్యాంకులకు మళ్లించి అక్కడినుండి కుళాయిలకు నీరు సరఫరా చేస్తారు. ఫిల్టర్ సక్రమంగా చేయక పోవడం వల్ల కులాల ద్వారా వచ్చే నీరు ఎర్రగా ఒంద్రు మట్టితో ఉంటున్నాయని చెబుతున్నారు. నీటి సరఫరా కోసం రూ.కోట్లు ప్రతి ఏడాది మున్సిపల్ అధికా రులు వెచ్చిస్తున్నారు. అయినా ఫిల్టర్ చేసిన నీటిని సరఫరాచేయకుండా నేరుగా వాటర్ ఇవ్వడమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



బదినేహాల్ క్రీడాకారులకు బంగారు పతకం

ప్రజాశక్తి -కౌతాళం

ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఖోఖో జిల్లాస్థాయి పోటీలలో మండల పరిధిలోని బదినేహాల్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులు బంగారు పతకం సాధించినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు రాజు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 24న కర్నూలు అవుట్ డోర్ స్టేడియం కర్నూలులో జిల్లా స్థాయి బాల బాలికల ఖోఖో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 16 జట్లు పాల్గొన్నాయి. ఈ టోర్నమెంట్లో మొదటి మ్యాచ్ నుండి జిల్లా పరిషత్ కన్నడ ఉన్నత పాఠశాల బదినే హాల్ క్రీడాకారులు అద్భుత ప్రదర్శన కనబరుస్తూ ఫైనల్ మ్యాచ్‌లో వారి శక్తికి మించిన నైపుణ్యాన్ని ప్రదర్శించి విజేతలుగా నిలిచి బంగారు పతకం కైవసం చేసుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. జిల్లాస్థాయి బాలికల ఖోఖో పోటీల్లో బంగారు పతకం సాధించిన మన పాఠశాల విద్యార్థులకు ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా చేతులమీదుగా బహుమతి ప్రదానం చేస్తారన్నారు.



బదినేహాల్ ఖోఖో క్రీడాకారులతో పిఇటి రాజు

కార్యకర్తలకు అండగా ఉంటాం

మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి- పెద్దకడబూరు : వైసిపి కార్యకర్తలకు అన్ని విధాల అండగా ఉంటామని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కమ్మలదిన్నెలో అనారోగ్యంతో మృతి చెందిన వైసిపి సీనియర్ నాయకులు భీమన్న భార్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం అందజేశారు. ఏకష్టమొచ్చినా పార్టీకి సేవలందించిన వైసిపి కార్యకర్తలకు తాము అండగా ఉండి ఆదుకుంటామన్నారు. మృతురాలు పొదుపు మహిళల మండల సమాఖ్య అధ్యక్షురాలుగా పనిచేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, దొడ్డిమేకల సర్పంచి చంద్రశేఖర్, నాయకులు అల్లయ్య, రంగముని, ఈరన్న, హనుమాపురం ఈరన్న తదితరులు పాల్గొన్నారు.



భీమన్న కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి





పెన్సిల్ సీసంపై బాలకృష్ణుని చిత్రం

సూక్ష్మ కళాకారిణి ప్రతిభ

ప్రజాశక్తి-మంత్రాలయం

శ్రీకష్ణ జన్మాష్టమి సందర్భంగా నళిని మానసని అనే సూక్ష్మ కళాకారిణి బాలకృష్ణుని చిత్రాన్ని పెన్సిల్ సీసంపై చెక్కితన ప్రతిభను కనబరిచారు. ఆదివారం స్థానిక మనసాని రాఘవేంద్ర శెట్టి కుమార్తె అయిన సూక్ష్మ కళాకారిణి బాలకృష్ణుని ప్రతిమను 4 గంటల వ్యవధిలో 8 మిల్లీమీటర్ల వెడల్పు, 1 సెం.మీ ఎత్తు పరిమాణంతో చెక్కి, అబ్బుర పరచడంతో గ్రామస్తుల నుంచి ప్రశంసలు అందుకున్నారు.



మంత్రాలయంలో నృత్య ప్రదర్శన చేస్తున్న 350 కళాకారులు , తిలకిస్తున్న పీఠాధిపతులు, అతిథులు

350 మందితో నృత్య ప్రదర్శన

అంతర్జాతీయ రికార్డు సృష్టించిన నృత్య కళాకారులు

ప్రజాశక్తి- మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్రస్వామి మఠం ఆవరణంలో 350 మందితో నృత్య ప్రదర్శన చేసి అంతర్జాతీయ రికార్డు సృష్టించారు. ఏకకాలంలో కళాకారులతో శ్రీరామనామ నామనృత్య ప్రదర్శన చేయించారు. ఆదివారం శ్రీ మఠం , నేషనల్ క్లాసికల్ డ్యాన్స్ అకాడమీ చన్నరాయపట్నం హాసన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కన్నుల విందు కలిగించింది. శ్రీ మఠం పీఠాధిపతుల ఆశీస్సులతో శ్రీ మఠం ఎదురుగా ఉన్న మధ్వ మార్గ కారిడార్‌లో 5:00 గంటలకు ప్రపంచం నలుమూలల నుండి 350 మందికి పైగా నృత్య కళాకారులను ఒకే వేదికపైకి తీసుకువచ్చారు. ఏకకాలంలో నృత్యం చేయడంతో 15 నిమిషాల పాటు శ్రీరామనామ గీతాలు పక్క వాద్య అకాడమీ జపాన్, జర్మనీ, ఇండోనేషియాతో సహా భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుండి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అరవిందర్ సింగ్, చీఫ్ మేనేజర్ ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ , అక్షత, శశికళ, భాగ్యలక్ష్మి, భారతి బాబు నేషనల్ క్లాసికల్ డ్యాన్స్ అకాడమీ జనరల్ సెక్రటరీ డాక్టర్ స్వాతి పి.భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

సొంత భవనం లేని వ్యవసాయ శాఖ

- దశాబ్దాలుగా ఉద్యోగులకు తప్పని కష్టాలు

- పదేళ్ల క్రితం మంజూరైనా పూర్తి కాని భవన నిర్మాణం

ప్రజాశక్తి - ఆస్పరి

రైతులకు చేదోడుగా ఉండే వ్యవసాయ శాఖ పట్ల ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తున్న పరిస్థితి ఆస్పరి మండలంలో నెలకొంది. కొన్ని దశాబ్దాలుగా వ్యవసాయ శాఖ కార్యాలయం పాడుబడ్డ చిన్నగదిలో కొనసాగేది. అధికారులు, ఉద్యోగులకు అసౌకర్యంగా ఉన్నప్పటికీ విధి లేని పరిస్థితులలో విధులు నిర్వహించేవారు. ఎంపీఈవోలు రైతులతో మీటింగ్ నిర్వహించేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఎన్నోసార్లు సొంత భవనం కోసం అధికారులు ప్రతిపాదనలు పంపినా పట్టించుకోలేదు. ప్రస్తుతం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందినబిల్డింగ్లో అధికారులు విధులు నిర్వహిస్తున్నారు.

అసంపూర్తిగా వ్యవసాయ శాఖ భవనం: పదేళ్ల క్రితం టిడిపి ప్రభుత్వంలో రూ.10 లక్షలతో బిల్డింగ్ మంజూరు అయింది. నిధులు లేక అర్థాంతరంగా ఆగిపోయింది. ప్రస్తుతం బిల్డింగుకు క్రాక్ రావడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ప్రస్తుతం ఆ భవనము పూర్తి కావాలంటే మరో రూ. 5 లక్షలు ఖర్చు చేయాల్సి ఉంది. ఇంజనీరింగ్ శాఖ అధికారులు భవన నిర్మాణం పూర్తి చేసేందుకు రూ. 5 లక్షలకు ప్రతిపాదనలు పంపారు.



పదేళ్ల క్రితం మంజూరైనా పూర్తి కాని భవన నిర్మాణం

ప్రస్తుతం స్కూల్ బిల్డింగ్‌లో వ్యవసాయ శాఖ

వ్యవసాయ శాఖకు ప్రస్తుతం సొంత భవనం లేకపోవడంతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన బిల్డింగ్లో విధులు నిర్వహిస్తున్నారు. ఇరుకైన గదిలో ఇబ్బందిగా ఉన్నప్పటికీ కొనసాగించక తప్పడం లేదు.

బిల్డింగు లేకపోవడంతో ఇబ్బందిగా ఉంది

వ్యవసాయ శాఖ అధికారి నరేంద్ర కుమార్



సొంత బిల్డింగ్ లేకపోవడంతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నాం. భవనం పూర్తి కావాలంటే రూ. 5 లక్షలు ఖర్చు అవు తుందని ఇంజనీర్ అధికారులు తెలిపారు. ప్రతి పాదనలు కూడా పంపాం.

వ్యవసాయ శాఖ భవనం పూర్తి చేయాలి- రైతు సంఘం మండల కార్యదర్శి రంగస్వామి



వ్యవసాయ శాఖ భవనం లేకపోవడంతో రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు. వ్యవసాయ శాఖ భవనం ఎక్కడ ఉందో తెలియక రైతులు పాత భవనం దగ్గరకి వచ్చి అధికారులు లేరని వెను తిరుగుతున్నారు. త్వరగా వ్యవసాయశాఖ భవనం పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలి.

సర్పంచులకు సర్వాధికారాలు

- రూ.46 కోట్ల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు : జనసేన

ప్రజాశక్తి - ఆదోని

గ్రామపంచాయతీలకే సర్వాధికారాలు ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని జనసేన ఇన్చార్జి మల్లప్ప అన్నారు. ఆదివారం జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 90 శాతం వైసిపికి చెందిన సర్పంచులే ఉన్నారన్నారు. వారందరికీ తగిన ఫండ్స్ ఇచ్చి అభివృద్ధికి సహకరించాల్సిన అవసరత గత సీఎం జగన్మోహన్ రెడ్డికి ఉన్న వారిని విస్మరించి నిధుల కోసం రోడ్డెక్కేలా చేశారని గుర్తు చేశారు. అందుకు భిన్నంగా పంచాయతీలను బలోపేతం చేసి సర్పంచులకు సర్వాధికారాలు కట్టబెట్టుతూ గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అడుగులు వేస్తున్నారన్నారు. ఆదోని నియోజకవర్గం లో జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ. 46 కోట్లు సరిపడా 256 అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు అధికారులు సిద్ధం చేసినట్లు తెలిపారు. కూటమి నాయకుల మధ్య ఎలాంటి విభేదాలు లేవని, మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. సమావేశంలో నాయకులు శ్రీనివాసులు, మహేష్, పులిరాజు, చిరుత, రాజశేఖర్, ఎల్లప్ప, జయరాం, ప్రకాష్, హరి తరుణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్లప్ప

ఖరీఫ్ పంటలు ఆశాజనకం

- పంటల దేవుని జోష్యం

ప్రజాశక్తి -దేవనకొండ

ఈ ఏడాది రైతులు సాగుచేసిన ఖరీఫ్ పంటలు ఆశాజనకంగా ఉంటాయని, రబీ సీజన్లో నల్లరేగడి పొలాల పంటల దిగుబడి కొంతమేర దిగుబడి తగ్గుతాయని పంటల దేవుని జోష్యం ద్వారా ఆలయ పూజారులు వెల్లడించారు. దేవనకొండ మండలంలోని నల్లచెలిమల గ్రామంలో శ్రావణమాసం మూడవ శనివారంలో భాగంగా పంటల దేవుడిగా పేరుందిన శ్రీలక్ష్మి నరసింహస్వామి ఉత్సవాలు గ్రామస్తులు ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న దోనకొండ వరకు ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి గన్నేరు పూల దండలు కొండలోకి ఒక్కొక్కటిగా వెళ్లి వస్తాయి. మొదటి, రెండవ పూలదండలు నలగకుండా వచ్చాయని దీంతో వర్షాలు సమృద్ధిగా కురిసి కర్రీకి పంటలు బాగా పండుతాయి అని ఆలయ పూజారి మురళి వెల్లడించారు. మూడవ దండ నలిగి రావడంతో నల్లరేగడి పొలాల్లో పంటల దిగుబడి కాదని సమీరా తగ్గుముఖం ఉంటుందని వెల్లడించారు. ఈ ఉత్సవాలను తిలకించడానికి వివిధ ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తాదులు హాజరయ్యారు.

విలువిద్య పోటీలు

ప్రజాశక్తి-కర్నూలు జిల్లాపరిషత్

ఆదివారం కకర్నూలు డిఎస్ఎ అవుట్‌డోర్ స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన విలువిద్య పోటీలకు ముఖ్య అతిథులుగా ప్రముఖ న్యాయవాది జి. శ్రీధర్ రెడ్డి, డిఎస్‌డిఒ భూపతిరావు మాట్లాడుతూ మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా ఈనెల 22 నుండి 29 వరకు జాతీయ క్రీడా దినోత్సవం భాగంగా ఆదివారం విలువిద్య పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. అనంతరం విలువిద్య పోటీలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విలువిద్య సంఘం కార్యదర్శి కె.నాగరత్నమయ్య, విలువిద్య సంఘం చీఫ్ పాటర్న్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, విలువిద్య సంఘం అధ్యక్షుడు సునీల్ కుమార్, జాయింట్ సెక్రెటరీ భరత్, వంశీకృష్ణ, విలువిద్య శిక్షకులు ఈదుల బాలాజీ రెడ్డి, రాజు, క్రీడాకారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. అండర్ – 9 ఇండియన్ బో బాలుర విభాగంలో ప్రథమ ద్వితీయ స్థానంలో విమల్, ఇషాన్ నిలిచారు. అండర్ 14 ఇండియన్ బాలుర విభాగంలో ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానంలో మల్లికార్జున, భరత్, రామ్ చరణ్ నిలిచారు. అండర్ 12 రికవరీ బాలికల విభాగంలో ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానంలో అద్వితీ, కియానా, ఆద్య నిలిచారు. అండర్ 12 రికవర్ బాలుర విభాగంలో ప్రథమ ద్వితీయ తృతీయ స్థానంలో ఇశాంత్, యోగాజ్ఞా, పార్థచంద్రా నిలిచారు.



విలక్షణ రచయిత కాశీభట్ల

సంతాప సభలో వక్తలు

ప్రజాశక్తి -కర్నూలు కల్చరల్

తన రచనలతో 20వ శతాబ్దాన్ని అత్యంత ప్రభావితం చేసిన జర్మన్ రచయిత ఫ్రాంజ్ కాఫ్కా లాంటివారు తెలుగు సాహిత్యంలో ఎవరైనా ఉన్నారంటే అది కాళీభట్ల వేణుగోపాల్ మాత్రమేనని వక్తలు కొనియాడారు. కర్నూలు సాహితీ మిత్రుల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నగరంలోని పింగళిసూరన తెలుగుతోటలో ఇటీవల కనుమూసిన కాళీభట్ల వేణుగోపాల్ సంతాపసభను నిర్వహించారు. సభకు సాహితీ స్రవంతి అధ్యక్షులు కెంగారమోహన్ ఆహ్వానం పలుకగా జి.వెంకటకృష్ణ సభాధ్యక్షత వహించారు. వక్తలుగా హాజరైన రచయిత, విమర్శకులు పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ కాళీభట్ల కుటుంబానికి, మతానికి, రాజ్యానికి ఎప్పుడూ బద్దుడు కాలేదని, సంప్రదాయ భ్రష్టత్వంతో జీవించిన ఆధునికుడన్నారు. విలక్షణమైన రచయితగా సమాజంపట్ల ముభావంగా వుంటూ రచనలు చేశారని, ఆయన నిరంతరం నేను, నాది అనే కోణం నుంచి రచనలు చేశారని, సమాజంలో జరిగే మార్పులను అంత త్వరగా అంగీకరించేవారు కాదని, ఈ విలక్షణమైన పరిస్థితులను కాళీభట్లను చదువ వలసి ఉందన్నారు. సభాధ్యక్షులు మాట్లాడుతూ అతని రచనలు చదివిన వారు అతనొకదశలో కలవడం అవసరం లేదనుకుంటారని అన్నారు. తాత్వికకోణం కలిగి మనిషికేంద్రంగా ఒక రకంగా చెప్పాలంటే పురుషమనస్తత్వకోణంలో సాగుతాయన్నారు. అతని రచనల్లో దిగంతం నవల సాహిత్యచరిత్రను మలుపుతిప్పిందన్నారు. రిటైర్డ్ ఎస్‌పి రామఉమామహేశ్వర శర్మ మాట్లాడుతూ కాళీభట్ల సాహిత్యజీవితం, అతని జీవితం వేర్వేరు కాదని, రెండూ వొకటిగా సాగిందన్నారు. కవిగా, కథకుడుగా, నవలా కారుడుగా తెలుగు సాహిత్యాన్ని కొత్తపుంతలు తొక్కించి తెలుగు సాహిత్యంలో విశేషమైన అభిమానులను సంపాదించు కున్నారన్నారు. సంగీత విద్వాంసులు ఎం.దయానంద్ మాట్లాడుతూ కాళీభట్ల వేణుగోపాల్ సంగీతపరిజ్ఞానం కలిగిన వారని, వేణుగోపాల్ పదాల పేరుతో స్వరాన్ని చేకూర్చారన్నారు. అతనికి సంగీతం పట్ల అభినివేశం గొప్పదన్నారు. సభలో కవి ఎలమర్తి రమణయ్య, కథారచయిత్రి డాక్టర్ సుభాషిణి ఆయన సాహిత్య విలక్షణమైన జీవితాన్ని వివరించారు. అంతకు ముందు ఆయన చిత్రపటానికి ప్రముఖవైద్యులు డాక్టర్ ఉమానాథరావు, శ్రీశ్రీప్రింటర్స్ అధినేత విశ్వేశ్వరరావు పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. సభకు ఆద్య మెడికల్స్ అధినేత అవిజ వెంకటేశ్వర రెడ్డి, సాహితీస్రవంతి రాష్ట్రకార్యదర్శి జంధ్యాల రఘుబాబు, విరసం రాష్ట్ర నాయకులు పాణి, నాగేశ్వరాచారి కవులు, రచయితలు మారుతీ పౌరోహితం, డాక్టర్ ఎం.హరికిషన్, చౌశా, సయ్యద్ జహీర్ అహ్మద్, డాక్టర్ పేరం ఇందిరాదేవి, కల్యాణదుర్గం స్వర్ణలత, సిఐ శ్రీనాథ్‌రెడ్డి, టి.వెంకటేష్,ఇనాయతుల్లా,ఎస్‌డివి అజీజ్, బాలశౌరి హాజరయ్యారు.




కాశీభట్ల చిత్రపటానికి పూలమాల వేస్తున్న అతిథులు

పీఠాధిపతుల హక్కులను కాపాడాలి

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

అల్ ఇండియా ముస్లిం మైనారిటీస్ కౌన్సిల్ చైర్మన్ సయ్యద్ మహమూద్ పీర్ ఆధ్వర్యంలో కర్నూలు పట్టణ దర్గా పీఠాధిపతులు , మసీదుల ముతవల్లీలు ఆదివారం పరిశ్రమల శాఖ మంత్రి టిజి. భారత్ ను ఆదివారం కలిసి వక్ఫ్ఆస్తులను పరిరక్షించి, పీఠాధిపతుల హక్కులను కాపాడాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వక్ఫ్ ఆమైండ్‌మెంట్ బిల్ 2024 లో చాలా లొసుగులు ఉన్నాయని, అసలు ఈ బిల్లును యావత్ భారత దేశంలోని ఏ ముస్లిం సంఘాలను, న్యాయవాదులను, పీఠాధిపతులను, తదితరమత పెద్దలతో సంప్రదించకుండా వక్ఫ్ చట్టంలోని దాదాపు 40 చట్టాల సవరణకు ప్రవేశపెడుతున్న ఈ బిల్లును వ్యతిరేకిస్తూ పార్లమెంట్ లో రసాభాస జరిగిందని తెలిపారు. దీనితో ఈ బిల్లు పై ఒక జాయింట్ పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేసారు. ఆ జాయింట్ పార్లెమెంటరీ కమిటీలో ఆంధ్ర ప్రదేశ్ నుండి టిడిపికి చెందిన 2 ఎంపిలు కూడా ఉన్నారన్నారు. అందుకే ఈ బిల్లు లో అన్ని ముస్లిం సంఘాలను, న్యాయవాదులను, పీఠాధిపతులను , ఇతర మత పెద్దలతో సంప్రదించి ఈ బిల్లు లోని వ్యతిరేకతను తొలగించి వక్ఫ్ బోర్డు , వాటి ఆస్తుల , దర్గా పీఠాధిపతుల హక్కులను కాపాడుతూ ముస్లింలకు న్యాయం చేయాలని కోరారు. కర్నూలు లోని దర్గా పీఠాధిపతులు, మసీదుల కమిటీల ముతవల్లీలు వారి అర్జీ ఈ బిల్లు ద్వారా వారు ఎంత నష్టపోతారనే దాని పై ముఖ్య మంత్రిని కలిసి విన్నవించుకుంటామని, అట్టి వారిని నారా చంద్రబాబు నాయుడు ను కలిసే విధంగా చూడాలన్నారు. ముఖ్య మంత్రి బాబు నాయుడును కలిసి చెప్పాలని మంత్రి టిజి. భారత్‌కు కోరారు. దీని పై మంత్రి టిజి. భారత్ స్పందిస్తూ కచ్చితంగా వారందరిని నారా చంద్రబాబు నాయుడు ను కలిసే విధంగా చేస్తామని చెప్పారు. అల్ ఇండియా ముస్లిం మైనారిటీస్ కౌన్సిల్ చైర్మన్ సయ్యద్ మహమూద్ పీర్ , రోజా దర్గా పీఠాధిపతి సయ్యద్ దాదా బాషా ఖాద్రి, ఖాలిక్ లింగ దర్గా పీఠాధి పాటి సయ్యద్ మాసూమ్ పీర్ ఖాద్రి, జిబి.దర్గా పీఠాధిపతి సయ్యద్ అథర్ పాషా, వక్ఫ్ ప్రొటెక్షన్ ఫోరమ్ షైక్ మునవ్వర్, సుల్తానియా మసీదు ముతవల్లి నూర్ మొహమ్మద్, సయ్యద్ రియాజ్ ఖాద్రి మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న పీఠాధిపతులు, ముతవల్లీలు



పాఠశాల ఆవరణలో నీటి తొలగింపునకు చర్యలు

ప్రజాశక్తి - మంత్రాలయం

ఇటీవల కురిసిన వర్షాలకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో వర్షపు నీటితో పాటు డ్రైనేజీ నీరు చేరి దుర్వాసన వెదజల్లుతోందని టిడిపి పట్టణ ఇంచార్జీ బి వరదరాజులు నిధుల వినియోగంపై ప్రధానోపాధ్యాయులను పత్రికల ద్వారా ప్రశ్నించడంతో స్పందించిన గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో నిలిచి ఉన్న నీటిని మోటారు ద్వారా సమీపంలో ఉన్న డ్రైనేజీ చాంబర్లకు పంపింగ్ చేశారు. నీటి పంపింగ్ పనులను టిడిపి పట్టణ ఇంచార్జీ బి.వరదరాజులు, పాఠశాల కమిటీ చైర్మన్ నరసింహ, ఎంపిటిసి నక్కి వెంకటేష్, నాయకులు అశోక్ రెడ్డి, శివ, డేవిడ్, రాజు పరిశీలించారు. పాఠశాల నిధుల అంశంపై టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ ఎన్.రాఘవేంద్ర రెడ్డి దృష్టికి తీసుకెళ్ళామని, నిధుల వినియోగంపై ఆరా తీస్తామని వరదరాజులు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది కంతం భీమయ్య, విజయ్ భీమేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరి మండలం నగరడోన గ్రామానికి చెందిన శేషాద్రి రెడ్డి (55) ఈ నెల 18న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి బెంగళూరులో చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతి చెందాడు. శేషాద్రి రెడ్డి కుమారుడు ప్రశాంత్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు.



శేషాద్రికి ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి-చిప్పగిరి

శేషాద్రి మరణ వార్త తెలుసుకున్న ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి బిశేషాద్రి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమం లో నరగాడోన వైసిపి సీనియర్ నాయకులు కోటేశ్వర రెడ్డి, మాజీ వైసీపీ కన్వీనర్ బెల్డోన ఓబులేసు, మాజీ ఎంపిటిసి మల్లికార్జున, చిప్పగిరి సురేష్ రెడ్డి, నరగాడోన వైసిపి నాయకులు పాల్గొన్నారు